క్లుప్తంగా

సీత్లాభవాని వేడుకలు

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామంలో మంగళవారం సీత్లాభవానీ వేడుకలను లంబాడీలు ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు బాజా బజంత్రీలతో గ్రామశివారులోని అడవిలోకి వెళ్లి సీత్లా భవానీ వేడుకలు నిర్వహించారు. సీత్లాభవానీకి మొక్కులు చెల్లించి సాంప్రదాయ దుస్తులతో దాండియా ఆడారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిట్యాల: మండలంలోని జడలపేట గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న వ్యక్తులు వావిల్ల బాలరాజు, ఎండి.అఫ్జల్, ఎం.ఆగాచారి, అడిదెల రాజిరెడ్డి, కద్రు ప్రతాప్‌రెడ్డి వద్ద రూ.4500లతో పాటు పేకాట ముక్కలు దొరికినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది నవీన్, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని దుబ్బగూడేనికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ అదుపు తప్పి పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి కుదురుపల్లి వాగు వద్ద బైక్ అదుపు తప్పిపడడంతో మధు, ఎజాస్‌లకు గాయాలయ్యాయి. వారిని వెంటనే మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య అందించి మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లికి తీసుకెళ్లారు.

సన్మానం

మహాముత్తారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన ఎండీ మౌలానా ఉద్యోగ విరమణ పొందారు. దీంతో పాఠశాలలో మంగళవారం ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు లావుడ్యి ప్రకాశ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా పాఠశాల, కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవ్‌సింగ్, రాంసింగ్, జయ, మధుకర్ రెడ్డి, మంజుల, రజిని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉద్యమ బాట నిర్వహించారు. భూపాలపల్లి మండలంలో కమలాపూర్, మల్లంపల్లి, ఆజాంనగర్, నాగారం, మహాముత్తారం, మండలలోని తదితర పాఠశాలలను సందర్శించి ఆ పాఠశాలల్లో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ.. ఏ పాఠశాలలో చూసినా అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని, పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవన్నారు. కొన్ని పాఠశాలల్లో మంచినీటి వసతి లేదని వాపోయారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు



టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్ (టీ)లో తాగునీటి సరఫరా పైపు లీకేజీ కావడంతో ఎంపీఓ గౌడ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ పంచాయితీ సిబ్బంది మరమ్మత్తులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ వర్షాకాలంలో పైపుల లీకేజీ వల్ల నీరు కలుషితముతుందని మరమ్మతు చేసినట్లు తెలిపారు. ప్రజలకు శుభ్రమైన తాగు నీటిని అందించడమే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాలని సూచించారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని మందలోరిపల్లి గ్రామానికి చెందిన బండి సమ్మయ్యగౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి చికిత్స పొందాడు. కాగా, మంగళవారం మందలోరిపల్లి, దుబ్యాల మాజీ సర్పంచ్‌లు కట్కూరి నరసింహారెడ్డి, బిల్లకంటి ఉమేందర్‌రావు పరామర్శించి, ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం ప్రమాద సంఘటనను అడిగి తెలుసుకుని, వృత్తిలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వారి వెంట ఉప సర్పంచ్ రజిత సంపత్, గౌడ సంఘం నాయకులు సారధి, గట్టు రవి, గుండెబోయిన తిరుపతి, మొగిళిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, స్థానికులు స్వామిరావు, రాయమల్లు, సునీల్, ఖాదర్, లక్ష్మన్, పోశయ్య, గుండెబోయిన రాయమల్లు, తదితరులు ఉన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

ప్రతీ ఇంటిలో మంచంపట్టిన ప్రజలు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందని వైద్యం
- పట్టణాలకు పరుగులు తీస్తున్న రోగులు

మంగపేట: మండలంలోని 25 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జ్వరాలు విజృంభించి డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా ఇంటికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున జ్వరాలతో మంచంపట్టారు. మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీల పరిధిలోని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారుల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైరల్ ఫీవర్స్‌పై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. కాగా, ఒక్కో గ్రామంలో 40 నుంచి 80 మందికి పైగా జ్వరపీడితులను గుర్తించినా మలేరియా, టైఫాయిడ్ రక్త పరీక్షలు నిర్వహిస్తూ నెగిటీవ్ రిపోర్టు వచ్చిందని వైరల్ ఫీవర్ అని చెప్పి మందులను ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

భయాందోళనలో జ్వరపీడితులు

వారం రోజులు దాటినా జ్వరాలు తగ్గక పోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో స్థానిక గ్రామీణ వైద్యులు సూచన మేరకు రక్తపరీక్షల కోసం వెళితే ప్రవేటు వైద్యులు డెంగీ జ్వరం కారణంగా రక్తకణాలు తగ్గాయని చెప్తుండటంతో మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనటువంటి ప్రజలు దేవుడిపై భారం మోపి స్థానిక ఆర్‌ఎంపీల వైద్యం పొందుతున్నారు. ఎలాంటి అర్హత లేనప్పటికీ మండలంలోని కమలాపురం, మంగపేట, రాజుపేటలో కొందరు ఆర్‌ఎంపీ వైద్యులుగా చలామణి అవుతూ, బినామీల పేరుతో మెడిక్ షాపులు, రక్త పరీక్ష కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. వారు కేవలం డబ్బుల సంపాదన కోసం రక్తపరీక్షలకు వచ్చే వారికి స్ట్రిప్స్‌ల ద్వారా పరీక్ష నిర్వహించి అందులో పాజిటీవ్ అని, రిపోర్టుల్లో రక్తకణాల సంఖ్య తగ్గిందని డెంగీ జ్వరమని చెపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిసింది.



వాజేడు: జ్వరంతో మంచం పట్టిన చిన్నారులు

జ్వరాలతో తల్లడిల్లుతున్న జనం

వాజేడు: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో ప్రజలు జ్వరాలతో తల్లడిల్లుతున్నారు. శివాలయం వీధిలో పలుచోట్ల నివాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉంటుంది. దానిని తొలగించే ఏర్పాట్లను అధికారులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగునీటితో శివాలయం వీధిలో దోమల ఉధృతి విపరీతంగా పెరగడంతో జ్వరాల తీవ్రత రోజు రోజుకు పెరుగుతుంది. శివాలయం వీధిలో ఉంటున్న ప్రజలు మలేరియా, జ్వరాలతో బాధ పడుతున్నారు. గ్రామంలో చాలా మంది పిల్లలు జ్వరాలతో ఇబ్బందిపడుతున్నారు. నివాసాల మధ్య ఉన్న మురుగునీటిని తొలగించాలని అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. దోమల నివారణ మందును ఇప్పటివరకు పిచికారీ చేయలేదని వాపోయారు. జ్వరాలు పెరుగుతున్నా ప్రభుత్వ వైద్యసిబ్బంది వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం లేదన్నారు. దీంతో అధిక డబ్బులు చెల్లించి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యసిబ్బంది పర్యటించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాల తీవ్రతను తగ్గించాలని వారు కోరారు.



వాజేడు: నివాసాల మధ్య మురుగునీటి గుంతలు

పరీక్షలు నిర్వహిస్తున్నాం..

“మండలంలో వైరల్ ఫీవర్ కేసులు ఎక్కువగానే ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లో మండల అభివృద్ధి అధికారి, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది సహకారంతో గ్రామాల్లో ఇంటింటి వైరప్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. జ్వర పీడితుల నుంచి రక్తమూనాలు సేకరించి మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అన్ని కేసులు నెగిటీవ్ రిపోర్టులు వస్తున్నాయి. ఎవరికి డెంగీ లక్షణలు కనిపించడం లేదు.

– నిఖిల్‌కుమార్, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి

వ్యాధులపై అప్రమత్తత అవసరం



ఏటూరునాగారం: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది



వెంకటాపురం(కె)లో..

ఏటూరునాగారం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం అని వైద్యాధికారి ప్రనీత్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొండాయి, మల్యాల గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రనీత్ కుమార్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం ఏడుగురు వ్యక్తులకు మలేరియా పరీక్షలు నిర్వహించారు. అనంతరం సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాస్కర్‌రావు, సమ్మక్క తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సుడిబాక, ఉప్పేడు, వీరాపురం, చిరుతపల్లి గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాగా మండల కేంద్రంలోనిని ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ క్యాక్రమంలో వైద్యాధికారులు సోహల్, వినయ్, ఆశీష్, స్నేహ, వైద్య సిబ్బంది జ్యోతి, మనోహర్, యాకలక్ష్మి తదితరులు ఉన్నారు.

రమణక్కపేటలో వైద్యశిబిరం

మంగపేట: మండలంలోని రమణక్కపేటలో సీతక్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్సై టీవీఆర్ సూరి ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల మంత్రి సీతక్క తనయుడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ ధనసరి సూర్య మండలంలోని రాజుపేటకు వచ్చిన సందర్భంగా రమణక్కపేటలో ప్రజలు జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలపడంతో స్పందించి ఉచిత వైద్య శిబిరాన్ని చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున, అనీష్‌లు సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లెపల్లి శివప్రసాద్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అభ్యర్థి ఇస్సార్‌ఖాన్, జిల్లా ప్రచార కార్యదర్శి, ఎఫ్‌ఎస్‌సిఎస్ డైరెక్టర్ కోడం బలాకృష్ణ, మండల నాయకులు కొంకతి సాంబశివరావు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్షలు చేసుకుంటున్న ప్రజలు

మొక్కలు పెంచడం అందరి బాధ్యత



మంగపేట: రమణక్కపేటలో మొక్క నాటుతున్న అధికారులు

మంగపేట: మొక్కలు పెంచడం అందరి బాధ్యత అని అటవీ శాఖ రేంజ్ అధికారి షకీల్‌పాషా అన్నారు. మండలంలోని రమణక్కపేట, మంగపేటలో అటవీశాఖ రేంజ్ అధికారి షకీల్‌పాషా ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. షకీల్‌పాషాతో కలిసి ఎస్సై టీవీఆర్ సూరి మొక్కలు నాటారు. అలాగే రేంజ్ పరిధిలోని ఎఫ్‌ఆర్‌ఓ, బీటాఫీసర్, బేస్ క్యాంప్ సిబ్బందితో కలిసి మంగపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ.. మొక్కలు పెంచడం వలన మానవాలికి ప్రాణవాయువును అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి అశోక్‌కుమార్, కోటేశ్వర్‌రావు, రషీద్, ఎఫ్‌ఎస్‌ఓలు ఉన్నారు.



వాజేడులో..

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మొక్కలను నాటారు. వన మహోత్సవంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏటూరునాగారం సెకండ్ ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత



బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడేనికి చెందిన జాడి దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జేఎల్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాకులు జాడి రామారాజు నేత, సభ్యులు మంగళవారం పరామర్శించి బియ్యం అందజేశారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం సమ్మక్క, సునార్కని లక్ష్మయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ కొండగొర్ల వెంకటయ్య, హరిబాబు, రమేశ్‌తో పాటు తదిరులు నాయకులు పాల్గొన్నారు.

'పాఠశాలలపై చర్య తీసుకోవాలి'

ములుగు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్య తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి అన్నారు. మంగళవారం మండలంలోని జాకారం లిబర్టి పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా లేక విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. కనీస వసతులు లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి



ఏటూరునాగారం: మాట్లాడుతున్న నాయకులు



మంగపేట: మాట్లాడుతున్న జయరాంరెడ్డి

మంగపేట: మంత్రి సీతక్కపై అహంకారంగా మాట్లాడిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మండల నాయకులు మాట్లాడారు. ఒక ఎమ్మెల్యే అయి ఉండి అసెంబ్లీలో ఓ మహిళా మంత్రి, ప్రజా సేవకురాలు అయిన సీతక్కపై జ్ఞానం లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. దీనికి ప్రతిఫలంగా నీ నియోజకవర్గ మహిళలే బుద్ధి చెపుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జయారాంరెడ్డి, నాయకులు సురేందర్, యానయ్య, నర్సింహారావు, నరేష్, ఆదినారాయణ, మల్లయ్య, శ్రావణ్‌కుమార్, శ్రీధర్, శేషగిరిరావు, వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంత్రి సీతక్కపై దురహంకారంగా మాట్లాడడం అతని అహంకారానికి నిదర్శనమని ఆయన వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి అజ్ఞాన బుద్ధితో అసెంబ్లీలో ఒక మహిళా మంత్రి, ప్రజాసేవకురాలు సీతక్కపై అహంకార పూరితంగా మాట్లాడడాన్ని సభ్య సమాజం ఖండిస్తోందన్నారు. ఈసమావేవంలో జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ.అయూబ్‌ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, మండల ఉపాధ్యక్షుడు ఈసం నరసయ్య, ఎండీ రియాజ్, జిల్లా యూత్ కార్యదర్శి ఎండీ గౌస్‌పాషా, మహిళా జిల్లా నాయకురాలు రాధిక, టౌన్ అధ్యక్షుడు సులేమాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుల హర్షం



ఏటూరునాగారం: వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు, నాయకులు



మంగపేటలో..

ఏటూరునాగారం: రెండో విడతలో భాగంగా రూ.1.50లక్షలు రుణమాఫీ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ఐటీడీఏలో ఏర్పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుణమాఫీని కార్యక్రమాన్ని మంగళవారం రైతులు వీక్షించారు. వ్యవసాయశాఖ అధికారుల సమక్షంలో రుణమాఫీ చేయడంతో వారి పేర్లు జాబితాల్లో ఉన్నాయా లేదా చూసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు రుణపడి ఉంటామన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు వెంకన్న, రఘు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు రుణమాఫీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లయ్య, ఖలీల్, ఆయూబ్, నర్సింహరావు, లాలయ్య, నర్సయ్య, తిరుపతి, రాధిక, గౌస్, సులేమాన్, శ్రీనివాస్, గోపాల్, శివకుమార్ పాల్గొన్నారు.

మంగపేటలో..

మంగపేట: ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకం రెండో విడతగా రూ.1.50లక్షలు మాఫీ చేయడంపై మంగళవారం రైతులు హర్షం వ్యక్తం చేశారు. మంగపేట రైతు వేదికలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసే కార్యక్రమానికి మండలంలోని రైతులు మంగళవారం వీక్షించారు. రెండోవిడత రుణమాఫీ పథకం ద్వారా మండలంలోని 1035 మంది రైతులకు లబ్ధి కల్పించనట్లు ఏఓ చేరాలు తెలిపారు. మొదటి, రెండవ విడద రుణమాఫీ కాని రైతులు రైతువేదికలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్‌లో నమోదు చేసుకుటున్నట్లు తెలిపారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

చిట్యాల: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు వివిధ గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన దేవా వీరన్న పాఠశాలపై ఉన్న అభిమానంతో విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, రాజమౌళి, సరళదేవి, నీలిమా రెడ్డి, విజయలక్ష్మీ, సుజాత, రాంనారాయణ, బుర్ర సదయ్య, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మరింత పోషకాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తిథి (సాముహిక) భోజనం పేరిట కార్యక్రమాన్ని చేపడుతుంది. సప్తాహ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో దాత పొనగంటి వీరబ్రహ్మం సహకారంతో విద్యార్థులకు అరటిపండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు.



టేకుమట్ల: అరటి పండ్లను అందజేస్తున్న గువ్వాడి లక్ష్మణ్

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకుఎ ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఆధ్వర్యంలో మంగళవారం తిథి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఫ్రైడ్ రైస్, అరటి పండ్లను అందజేశారు. తిథి భోజనంలో విద్యార్థులకు అరటి పండ్లను అందించిన ఆరెపల్లి గ్రామానికి చెందిన గువ్వాడి లక్ష్మన్‌కు పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

భూపాలపల్లి రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీసీ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దొంగల రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని మాయ మాటలు చెప్పి బీసీలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ కులగణన పూర్తయిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని లేకుంటే బీసీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కలెక్టరేట్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు.గొల్ల కురుమలకు రెండో దశ గొర్రెలను పంపిణీ చేయాలి విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులకు సబ్సిడీతో కూడిన చేప పిల్లల పంపిణీ చేయాలన్నారు. వేములరాజు గౌడ్, కంబాల రాజయ్య, రాష్ట్ర నాయకులు బట్టు రవి ఉన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మొసలి కళేబరం గుర్తింపు

వాజేడు: మండల పరిధిలోని దూలాపురం, పాయబాటలు గ్రామాల మధ్యన మొసలి కళేబరాన్ని అటవీ శాఖ సిబ్బంది మంగళవారం గుర్తించారు. మొసలి ఎలా మృతి చెందింది అనే విషయం తెలియలేదు. మృతి చెందిన కళేబరం దుర్గంధం రావడంతో ఇతర జంతువులకు ఎలాంటి హానీ కలుగవద్దని అటవీ శాఖ సిబ్బంది పంచనామా నిర్వహించి ఖననం చేశారు.

